# యుద్ధ పర్వం

వీరపల్లె వీణావాణి

అది.:. మా యూనివర్సిటీ ఉమెన్స్ హాస్టల్ ఆవరణం. హాస్టల్ ఆవరణం మొత్తం చాలా ప్రశాంతంగా, నిశ్శబ్దంగా ఉంది. అంత ప్రశాంత వాతావరణం అక్కడ చోటు చేసుకుందంటే... అదేం అర్ధరాత్రి కాదు. అది పట్టపగలు. పైగా పది గంటల ప్రాంతం. అన్ని రోజుల్లోనూ కోళ్ళ ఫారంలా సందడితో అగుపించే మా ఉమెన్స్ హాస్టల్. ఇవ్వాళింత డీసెంట్‌గా ఉందంటే అందులో గొప్ప సస్పెన్సు లాంటి దేం లేదు.

యూనివర్సిటీ పరీక్షలు దగ్గర పడుతున్నాయి. అందరికీ ప్రిపరేషన్ హాలిడేస్ ఇచ్చేశారు. హాస్టల్లోని అమ్మాయిలు చాలామంది తమ తమ ఊళ్ళకి వెళ్ళిపోయారు. హాస్టల్లో ఉన్న ఆ కొంతమంది కూడా రూముల్లోంచి బయటకు రాకుండా... తలుపులు బిడాయించుకుని సీరియస్‌గా పుస్తకాలు ముం దేసుకుని చదువుకుంటున్నారు.

"సింధూ! ఏయ్ సింధూ!" అంటూ మా రూం తలుపుమీద ఎవరో దబదబా బాదారు. చదువుకుంటున్న నోట్‌బుక్‌ని తీసి టేబుల్‌మీద పడేసి, తలుపు గడి తియ్యడం కోసం కుర్చీలోంచి మెల్లగా లేచి రెండడుగులు వేశాను. ఇంతలో మా రూమ్మేట్ మాళవిక నా పైట పట్టుకుని నన్ను వెనక్కి లాగింది. 'తలుపు తెరవకు' అన్నట్టు చూసింది.

"మాళా! ఎవరో తలుపు తడుతున్నారే!"

"ఎవరో అయితే నా కభ్యంతరం లేదు. ఆ వచ్చింది ఎవరో తెలుసా నీకు? భాగీరథి" అంది మాళవిక.

"అయితే ఏం?" అడిగాను.

"ఇప్పుడు నువ్ తలుపు తెరిస్తే ఇంకేమైనా ఉందా? అసలే అది పది రోజుల్నుంచి ఆవురావురమంటూ ఉంది బ్రెయిన్స్ తినడానికి. దాని రూమ్మేట్సంతా ఊ రెళ్ళిపోయారు. రూంలో భాగీరథి ఒక్కతే ఉంది. దానికి సుత్తెయ్యడాని కెవరూ దొరికినట్టు లేరు. అందుకే ఇప్పు డది మన మెదడుల్ని తినే ప్రాజెక్ట్ వర్కుమీదే మన రూంవేపు వచ్చినట్టుంది." చాలా మెల్లగా అంది మాళవిక.

దాని మాటలకి నేను పకపకా నవ్వేశాను.

"అన్నట్టు సింధూ! నీ పర్సులో డ బ్బేమైనా ఉంటే ఎక్కడైనా వెంటనే దాచేసుకో!" అంది మాళవిక.

"ఎందుకే?"

"పరాయివాళ్ళ పర్సులో డబ్బు అగుపిస్తే చాలు... భాగీరథి సంబరపడిపోతుంది అప్పుకోసం. అసలు దానికున్న హాబీల్లో రెండోది ఏమిటో తెలుసా? అప్పులు చెయ్యడం" అంది మాళవిక.

"మొదటి హాబీ?"

"చేసిన అప్పుల్ని పర్మనెంట్‌గా ఎగ్గొట్టడం."

నేను బిగ్గరగా నవ్వేశాను.

"అందుకే భాగీరథికి వాళ్ళ రూమ్మేట్సంతా కలిసి 'బాకీరథి' అని నిక్ నేం పెట్టారు." చెప్పింది మాళవిక.

"ఒసే సింధూ, మాళా! ఏం పోయేకాల మొచ్చిందే మీకు? తలుపు తెరవండే." రూం బయట అరుస్తోంది భాగీరథి.

నేను తలుపు తీశాను. రూంలోకి ప్రవేశించిన భాగీరథీ నేల చూపులు చూస్తూ రూమంతా వెదకసాగింది.

"ఏమిటే వెదకుతున్నావ్? పాముకోసం వెదికే యానాదిలా..." నవ్వుతూ అడిగింది మాళవిక.

"ముత్యాల కోసం" అంది భాగీరథి.

"ఏం లేదూ... ఇందాక మీ రూంలో ఒకటే పకపకలు వినిపిస్తేనూ... నోటి ముత్యాలు గానీ రాలాయేమోనని..."

"మా రూంలో నోటి ముత్యాలు రాలవే. మా రూం కొచ్చి ఇలా మమ్మల్ని డిస్టర్బ్ చేసేవాళ్ళ పళ్ళు మాత్రం రాలతాయి." మాళవిక.

"నేను తినడానికి నీకు మెదడంటూ ఉంటేగా..."

నాకు న వ్వాగలేదు.

"అది సరే గానీ... ఇదేమిటే సింధూ! మీ రిద్దరిలా తలుపులు బిడాయించుకుని వీరచదువులు చదివేస్తున్నారు?" అడిగింది భాగీరథి.

"పరీక్షలు దగ్గర పడుతున్నాయి కదే" అన్నాను.

"ఓసి వెర్రిమొహమా! సంప్రదాయాలంటే మనవాళ్ళకి చచ్చేంత ఇష్టం" అంది భాగీరథి.

"సంప్రదాయా లేమిటే? నా కర్థం కావడం లేదు" అంటూ ప్రశ్నార్థకంగా భాగీరథి వేపు చూశాను.

"ప్రకటించిన తేదీల్లో యూనివర్సిటీ పాలకవర్గం పరీక్షలు పెట్టపోవడం, మెస్ బిల్ తాలూకూ డ్యూస్ కట్టని పక్షంలో పరీక్షలకి హాల్ టికెట్స్ ఇవ్వం అంటూనే హాల్ టికెట్స్ ఇచ్చెయ్యడం, పరీక్షల్ని జరిపిన తరువాత ఫలితాల్ని ప్రకటించాలనే విషయాన్ని విస్మరించడం... ఇవన్నీ సంవత్సరాల తరబడి వస్తున్న యూనివర్సిటీ సత్సంప్రదాయాలు. కనుక... మన పరీక్షలు పోస్ట్‌పోన్ కావచ్చు" అంది భాగీరథి.

భాగీరథి ఎప్పుడూ ఇంతే. చాలా చమత్కారంగా మాట్లాడుతూ అందర్నీ తెగ నవ్విస్తూ ఉంటుంది. ఏ గదిలో భాగీరథి ఉంటే ఆ గదిలో గొప్ప సందడిగా ఉంటుంది. నేనూ, మాళవికా, భాగీరథీ ముగ్గరమూ ఎం.ఎ. ఫైనల్ తెలుగు లిటరేచర్ చదువుతున్నాం. మా క్లాసులో మేం ముగ్గురం గాక మరో ఏడుమంది అమ్మాయిలున్నాం. నిజానికి మా అందరిలోకి భాగీరథే చదువుల్లో చాలా తెలివైన అమ్మాయి.

ఒక్కసారి గానీ పుస్తకం చదివిందంటే... అందులోని విషయమంతా భాగీరథి బుర్రలో అలాగే చెక్కుచెదరకుండా నిలిచిపోతుంది. కానీ... భాగీరథికి బద్ధకం ఎక్కువ. ఎం.ఏ. ఫస్టియర్లో తనకు రావలసిన ఫస్ట్ రాంక్‌ను ఈ బద్ధకంవల్లే భాగీరథి పోగొట్టుకుంది. భాగీరథి గానీ బద్ధకం వదిలిపెట్టి కాస్త ఓపిగ్గా చదివి ఉన్నట్లయితే ఎం.ఏ. ఫస్టియర్లో ఫస్ట్ రాంక్ ఎలాంటి పరిస్థితులలోనూ నాకు దక్కేది కాదు.

"అన్నట్టు భాగీరథీ! లిటరరీ క్రిటిసిజంలో నాకో చాప్టర్ సరిగ్గా అర్థం కావడం లేదే. నాట్యశాస్త్రాన్ని రాసిన భరతుని రస సిద్ధాంతానికీ, అరిస్టాటిల్ ప్రతిపాదించిన 'కెథార్సిస్' థియరీకి ఉన్న సంబంధం గురించి నా క్కాస్త వివరంగా చెప్పవే నీకు పుణ్య ముంటుంది" అంటూ టేబుల్ మీదున్న నోట్‌బుక్‌ని తీసి భాగీరథి చేతిలో పెట్టాను.

"చూడు సింధూ! సాంబారుకీ- ఇడ్లీకి మధ్యగల సంబంధం గురించి అడుగు... ఏకబిగిని ఎక్స్‌ప్లెయిన్ చేస్తాను. లేదా వొల్లకాటికీ శవానికీ, శవానికీ శ్రాద్ధానికీ మధ్యగల అటాచ్‌మెంట్ గురించి అడుగు... అలసట లేకుండా అరగంటసేపు అనలైజ్ చేసి చెబుతాను. అంతేగానీ... ఈ రస సిద్ధాంతాల గురించి, పిండాకూడు థియరీల గురించి మాత్రం అడక్కు. నేనేం చెప్పలేను" అంటూ నోట్‌బుక్‌ని తిరిగి ఇచ్చేసింది భాగీరథి.

"ఏమిటే భాగీరథీ! వొల్లకాడని, శవమని, శ్రాద్ధమని, పిండాకూడని... స్మశానం ఏరియా లాంగ్వేజీని తెగ మాట్లాడుతున్నావ్? యూనివర్సిటీలో అదేదో ఫంక్షన్ సందర్భంగా ఏకపాత్రాభినయాల పోటీని పెడుతున్నారని విన్నాను. ఆ పోటీలో పాల్గొనడం కోసం కొంపదీసి నువ్వు హరిశ్చంద్ర కాటి సీన్ గానీ ప్రాక్టీస్ చేస్తున్నావేమిటి?" భాగీరథిని గేలిచెయ్యడం కోసం నవ్వుతూ అంది మాళవిక.

"నేను కాటి సీన్ ప్రాక్టీస్ చేస్తున్న మాట యధార్థమే కానీ మాళా! అది ఏకపాత్రాభినయం

పోటీల్లో పాల్గొనడం కోసం మాత్రం కాదు." మాళవికతో అంది భాగీరథి.

"మ రెందుకో!"

"కాటికాపరిగా కర్మకాండలు నిర్వహిద్దామని..."

"ఎప్పుడు?"

"నువ్ చచ్చినప్పుడు."

భాగీరథి అలా అనడంతోటే నేను పకపకా నవ్వేశాను. మాళవికకి మాత్రం ఒళ్ళు మండిపోయింది.

మాళవిక ఎప్పుడూ ఇంతే. భాగీరథి మీద కావాలని జోక్ వేస్తుంది. వెంటనే భాగీరథి ఆ జోక్‌ని రివర్స్ చేసి మాళవిక మీదే పేలేటట్టు చాలా సమయస్ఫూర్తితో వ్యవహరిస్తుంది.

"అదిసరే గానీ భాగీరథీ! ఇటీవల నీకోసం ఓ ఎర్రటి కుర్రాడు పదే పదే మన హాస్టల్ చుట్టూ, ఈగలాగా తెగ తిరిగేస్తూ ఉన్నాడని తెలిసింది. ఎవరే అతడు?" అడిగాను నేను.

"ఇంజనీరింగ్ కుర్రాడులే. నా ప్రేమకోసం టెండర్ వేసే ప్రయత్నంలో గింజుకుంటున్నాడు."

"గ్రీన్ సిగ్నల్ ఇచ్చావా?" అడిగింది మాళవిక.

"ఇస్తే ఇంకేమైనా ఉందా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లా దూసుకుపోడూ" అంది భాగీరథి.

"ఇంజనీరింగ్ చదివే అబ్బాయిలు ఇలా మన పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివే అమ్మాయిల కోసం వెంపర్లాడడం? వాళ్ళ కాలేజీలో అమ్మాయి లుండరా?" ప్రశ్నించాను.

"ఉంటారు. కానీ తక్కువ. అబ్బాయిల సంఖ్యేమో ఎక్కువ. అందుకని పాపం వాళ్ళకి కోటా సరిపోదు."

నేను నవ్వాను.

"అన్నట్టు సింధూ! మీ కీ విషయం తెలుసా?"

"రిలే చేయ్" అంది మాళవిక.

"మన హాస్టల్లో రీసెర్చి స్కాలర్స్ రూముల్లో శ్వేత అని ఓ తారుడబ్బా ఉంది తెలుసుగా? ఆవిడకి మన యూనివర్సిటీలోనే ఇటీవల లెక్చరర్ ఉద్యోగం వచ్చిందట" చెప్పింది భాగీరథి.

"ఏమిటీ? శ్వేతకి లెక్చరర్ ఉద్యోగం వచ్చిందా? ఆవిడకి సబ్జెక్ట్‌లో ఓనమాలు రావు. పైగా పిహెచ్.డి. డిగ్రీ కూడా లేదు" అంటూ చాలా ఆశ్చర్యపోయింది మాళవిక.

"పిచ్చిదానా! వడ్డించేవాడు మనవాడైతే అది చాలు. పంక్తిలో ఎంత చివర కూర్చున్నా భయముండదు" అంది భాగీరథి.

"వడ్డించేవాడు మనవాడైతే మాత్రం... మనం మన పక్కవాడి కడుపు కొడతామా? పక్కవాడి విస్తరిలో భోజనాన్ని పెట్టనివ్వకుండా చేస్తామా? శ్వేత ఆ ఉద్యోగాన్ని ఎలా సంపాదించి ఉంటుందో నేను చాలా సులభంగా ఊహించగలను. అలా అడ్డదారిలో సంపాదించుకున్నది కూడా ఓ ఉద్యోగమేనా? అవినీతివల్ల పొందిన గెలుపు... నిజాయితీవల్ల పొందిన ఓటమికంటే ఏవిధంగానూ గొప్పది కాదు" అంది మాళవిక.

"అంటే... నీ ఉద్దేశం..."

"ఆశయసాధన కోసం మనిషి అవలంబించే, అనుసరించే నైతికమైన మార్గమే ముఖ్యం తప్ప... ఆ ఆశయ సాధనలో మనిషి గెలవడం, ఓడడం ముఖ్యం కాదు. అంటే... శ్వేత ఈ ఉద్యోగాన్ని గెలుచుకుంది. అయితే ఈ గెలుపునకు ఆవిడ అనుసరించిన పద్ధతులు నీతిబాహ్యమైనవి కాబట్టి... నైతిక దృష్టిలో శ్వేత ఓడిపోయినట్టే లెక్క. ఆశయ సాధనకి నీతిబాహ్యమైన పద్ధతుల్ని పట్టే అసమర్థులు మాత్రమే అనుసరిస్తారు" అంది మాళవిక.

"మాళా! నువ్ చెప్పే ధర్మాలకీ, నైతిక సూత్రాలకీ కాలం చెల్లిపోయి చాలా కాలమైంది. ఈనాడు ఈ లోకం ఒక సంగ్రామ భూమి. జీవితమంటే ఒక మహా సంగ్రామం. ఈ సంగ్రామంలో ప్రతి మనిషీ ఓ సైనికుడై గెలుపుకోసం రకరకాల పోరాట పద్ధతుల్ని అనుసరిస్తున్నాడు. ఈ అవిశ్రాంత మహా సంగ్రామంలో సైనికుడి దృష్టి నైతిక సూత్రాల మీదినుండి మరలింపబడి... ఒక్క గెలుపుమీదే కేంద్రీకృతమైపోయింది." భాగీరథి చెబుతోంది.

నేను ఆసక్తిగా వింటున్నాను.

"ఈ జీవన సంగ్రామంలో మనిషి నైతిక విలువల్ని గుర్తు పెట్టుకుంటే గెలవలేడు. గెలవా లనుకుంటే నైతిక విలువల్ని గుర్తు పెట్టుకోలేడు. శత్రువుని ఏదోవిధంగా దెబ్బకొట్టి పడగొట్టే ప్రయత్నం చెయ్యాలే తప్ప... తను కొట్టే దెబ్బ ధర్మబద్ధమైంది అవునా, కాదా అనే తర్కవితర్కాలు యుద్ధభూమిలో ఉండకూడదు. అలా ఉండకపోబట్టే... రాముడు వాలితో గెలవగలిగాడు. భీముడు దుర్యోధనునిపై గెలుపొందగలిగాడు."

"భాగీరథీ! పౌరాణిక సంఘటనలకి వక్రభాష్యా లిచ్చి అతి తెలివిని ప్రదర్శించకు. నువ్ గొంతు చించుకుని వాదించినా నీ అభిప్రాయాలతో నేను ఏకీభవించను. ఈ లోకం ను వ్వన్నట్టు ఓ సంగ్రామభూమి కావచ్చు. కానీ సంగ్రామ భూమిలోనూ కొన్ని నీతులూ, నియమాలూ ఉంటాయి. ఆశయ సాధనకోసం ఎత్తుల్ని జిత్తుల్ని అనుసరించే మనిషి మసలవలసింది మానవ సమాజంలో కాదు. నక్కలూ, తోడేళ్ళూ తిరిగే అడవిలో" అంది మాళవిక.

"ఇప్పు డీ మానవ సమాజ మొక మహారణ్యం కాదని నీ కెవరు చెప్పారు?" అంటూ వాదించడం మొదలుపెట్టింది భాగీరథి.

నేను వాళ్ళ వాదోపవాదాల్ని వింటూ ఆలోచించసాగాను. ఆలోచించేకొద్దీ భాగీరథి అభిప్రాయాలు అంత సమంజసమైనవి కాదని నా కనిపిస్తూ ఉంది. మాళవిక మాటల్లో యథార్థ ముంది. నిజమే... అవినీతివల్ల పొందిన గెలుపు... నిజాయితీవల్ల పొందిన ఓటమికంటే ఏవిధంగానూ గొప్పది కాదు. వజ్రంలాంటి విలువైన సత్యాన్ని వల్లించింది మాళవిక. సమర్థులూ, సహృదయులూ ఏనాడూ ఆశయ సాధనకు నీతిబాహ్యమైన మార్గాన్ని అనుసరించరు.

"అన్నట్టు సింధూ! అనవసరమైన మాటల్లో పడి నేను అసలు విషయాన్ని మర్చిపోయానే" అంది భాగీరథి.

"ఇప్పుడు చెప్పిందంతా వడ్డీ విషయమా?"

"కాదు. నీ పిండాకూడు విషయం."

"భాగీరథీ! మాళ మాటలకేం గానీ... ఇంతకీ నువ్ మర్చిపోయిన ఆ అసలు విషయం ఏమిటో చెప్పు" అడిగాను.

"ఇందాక పోస్ట్ ఏమైనా వచ్చిందేమోనని చూద్దామని కెళ్ళాను. లెటర్స్ బాక్స్‌లో నీ కొచ్చిన ఈ ఉత్తరం అగుపించింది" అంటూ ఓ ఇన్‌లాండ్ కవర్ని నా కందించింది భాగీరథి.

"భాగీరథీ! నా కేమైనా వచ్చిందా" అడిగింది మాళవిక.

"ఆఁ... వచ్చినట్టే ఉంది."

"ఏమిటీ?"

"పోయేకాలం."



ఫోటో: ఎస్. ఎస్. రావు [మద్రాసు]

"ఛీఛీ... నోరు తెరిస్తే పాడు మాటలు తప్ప... ఒక్క మంచి మాట రాదు. మీ యమ్మ నిన్ను తుపాన్ల సీజన్‌లో కని ఉంటుంది" అంది మాళవిక.

"చాల్లే నోరు మూసుకో" అంది భాగీరథి.

నేను లెటర్ చదవడం ముగించాను.

"ఎక్కడినుండే ఉత్తరం?" అడిగింది భాగీరథి.

"ఈ ఊళ్ళోనుండే."

"ఈ ఊళ్ళోనుండా?"

"ఎవ ర్రాశారు సింధూ?" ప్రశ్నించింది మాళవిక.


"అదే తెలియడం లేదు."

"ఈ ఊళ్ళోనే అది రాయబడిం దంటున్నావు. కానీ రాసిం దెవరో తెలియ దంటున్నావు. ఏమిటే ఇది?" అడిగింది భాగీరథి.

"అ దో చిన్న కథలే."

"అచ్చులోనైతే అరపేజీ వస్తుందా? ఆ కథేమిటో అయిదొందల పదాలు దాటకుండా చెప్పేయ్" అంది భాగీరథి.

"నేను చెప్పడ మెందుకులే. ఉత్తర మిస్తాను. నువ్వే చదువుకో అర్థమైపోతుంది" అంటూ ఆ లెటర్ని భాగీరథి కిచ్చాను.



"అబ్బ! ఆ రైటింగేమిటే పైశాచీ ప్రాకృతంలాగుంది."

"ఏదీ ఏదీ ఇలా ఇవ్వు చూస్తాను" అంటూ ఆత్రతగా భాగీరథి దగ్గరికొచ్చి లెటర్లోకి తొంగిచూసింది మాళవిక.

"ఏయ్! ఏయ్! కాస్త ఆగు. నువ్ చూడ్డాని కిదేం వేలం నోటీసూ కాదు. పదిమందీ చదువుకునే పాంప్లెట్టూ కాదు. ఇది పర్సనల్ లెటర్. అందుచేత... గోడమీది తొండలా నువ్ అదేపనిగా తొంగి తొంగి చూడకే." నవ్వుతూ భాగీరథి అంది మాళవికతో.

"తెలివికి సంతోషించాం గాని... కాస్త గట్టిగా వినిపించేలా చదివి అఘోరించు" అంది మాళవిక.

"సరే చదువుతున్నాను. విని అఘోరించు మరి" అంటూ ఉత్తరాన్ని చదవసాగింది భాగీరథి.


"సింధూగారికి... ఇది నేను మీకు రాస్తున్న నాలుగో ఉత్తరం. అయిదు రోజుల కోసారి నేను రాస్తున్న ప్రతి లెటరూ మీకు అందుతూనే ఉందనుకుంటాను. ఇదేదో చౌకబారు ప్రేమ వ్యవహారం కింద మీరు నా విషయాన్ని తేలిగ్గా తీసి పారెయ్యకూడదని మనవి.

నేను మీకు రాస్తున్న ఏ లెటర్లోనూ నా అడ్రస్, వివరాలు రాయడం లేదు. మనం ముఖాముఖిగా కలుసుకున్నప్పుడే నా పేరూ, వివరాలూ చెబుతాను. గత శుక్రవారం సాయంత్రం అయిదు గంటలకి మిమ్మల్ని ఆడిటోరియం దగ్గరికి ఒంటరిగా రమ్మని మూడో ఉత్తరంలో రాశాను.

కానీ... మీరు రాలేదు. ఎదురు చూసి చూసి నేను తిరిగి మా హాస్టల్‌కి వెళ్ళిపోయాను. ఆ రాత్రి నాకు అన్నం సహించలేదు. చూడండి సింధూగారూ! సున్నితమైన వ్యవహారాల్లో మొరటుతనాన్ని ప్రదర్శించకూడదు. దానికి కొన్ని హృదయాలు తట్టుకోలేవు.

పాషాణం కంటే కఠినమైందీ, పత్తికంటే అతి మెత్తనైందీ మనిషి హృదయమే. ఈ లెటర్ మీకు మంగళవారం అందుతుంది. మీరు బుధవారం సాయంత్రం సరిగ్గా నాలుగ్గంటలకి యూనివర్సిటీ లైబ్రరీలోని తెలుగు బుక్స్ ఉండే సెక్షన్లోకి రండి. తప్పక రావాలి.

ఇట్లు
మీ?????




ఉత్తరం చదవడం ముగించిన భాగీరథి నా వేపు నవ్వుతూ చూసింది. మాళవిక కూడా నన్నే చూస్తోంది.

"సింధూ! ఈ ఉత్తరాల ప్రహసనంవల్లేనా నువ్ ఈమధ్య అదో రకంగా... ఏదో ఆలోచిస్తున్నట్టుగా పరధ్యానంతో కొట్టుమిట్టాడుతున్నావు?" నాలోని మార్పుని గుర్తించి అడిగింది మాళవిక.

"ఇత డెవడో తెలియదు. ఇతనికి నా రూం అడ్రస్ ఎలా తెలిసిందో అర్థం కావడంలేదు" అన్నాను.

"మన యూనివర్సిటీ లైబ్రరీలో ఏయే రాక్‌లో ఏయే పుస్తకం ఉంటుందో అబ్బాయిలకి తెలియదు గానీ... ఉమెన్స్ హాస్టల్లో ఏయే రూంలో ఏయే అమ్మా యుంటుందో... ఆ అమ్మాయి పేరూ, ఊరూ, కులం, గోత్రం ఆఖరికి ఆ అమ్మాయికి ఏయే రంగు చేర లున్నాయో అన్నీ సులభంగా తెలుసుకోగలరే ఈ మగవాళ్ళు" అంది భాగీరథి.

"ఈ అబ్బా యెవరో గానీ.. పాపం సిన్సియర్‌గానే నిన్ను లవ్ చేస్తు న్నట్టున్నాడు సింధూ. ఉత్తరం రాసిన పద్ధతిలోనే అబ్బాయి సిన్సియారిటీ అగుపిస్తూ ఉంది" అంది మాళవిక.

"నిజమేనే. మరొకరై ఉంటే.. 'సింధూ నా హృదయ బంధూ! నీ దర్శనంతో చేయి నాకు కనువిందు. నా జీవిత భాగస్వామివి నీవే ఇక ముందు' అంటూ టన్నుల కొద్దీ కవిత్వం రాసే వాళ్ళు" అంది భాగీరథి.

"రేపు సాయంత్రం నాలుగింటికి లైబ్రరీ దగ్గరికి రమ్మని రాశాడు కదా. తప్పకుండా వెళ్ళవే. లేకపోతే అతడు డిసప్పాయింటై పోతాడు. వెళ్ళి ఎవరో, ఏమిటో తెలుసుకో" అంది మాళవిక.

"నాకు మాత్రం మన క్లాస్‌లో ఆ మొగిలిచర్ల గుమ్మడి కాయ మొహం గాడు లేడూ.. అదేనే మార్కండేయులు. ఈ లెటర్స్ అతడే రాస్తున్నాడని నా అనుమానం." నా అనుమానాన్ని బయట పెట్టాను.

"పాపం అత డలాంటి వాడు కాదే. అమ్మాయిలంటే అతనికి భయంకరమైన గౌరవం. మార్కండేయులు యూనివర్సల్ బ్రదర్. పైగా అతని హేండ్ రైటింగ్ నాకు బాగా తెలును" అంది భాగీరథి.

"మన క్లాస్‌లో కిటికీ దగ్గర కూర్చుని అమ్మాయిల వేపు చూస్తూ చొంగ కార్చుకుంటూ ఉంటాడే చెంగారావు. అదేనే చొక్కారావు. నాకు మాత్రం అతడి మీదే అనుమానం" అంది మాళవిక.

"చొక్కారావు దంత జస్ట్ చూసి ఆనందించే మెథడ్. పైట కొంగుల్ని చూసి తృప్తి పడిపోయి పరవశించే అతడు.. ఉత్తరాలు రాసేంత ఉద్రేకం పొంది ఉండ డనుకుంటా" అంది భాగీరథి.

"ఇంత చర్చ ఎందుకే? ఎంచక్కా రేపు సాయంత్రం నాలుగింటికి లైబ్రరీ దగ్గరి కెళ్తే ఆ అజ్ఞాత ప్రియు డెవరో తెలును. కోపమ్మగా. కావాలంటే రేపు నీకు నేను తోడు వస్తాలే" అంది మాళవిక.

"ఎవరు? నువ్వా? వె ళ్ళొద్దులే. ను వ్వెళ్తే డేంజరే. ఆ కుర్రాడు కాస్త అందంగా ఉంటే.. సింధుని వెనక్కి నెట్టి పారేసి.. అతన్తో నువ్ ప్రొసీడై పోతావు" అంది భాగీరథి నవ్వుతూ.

మా మేనత్త కొడుక్కి న న్నిచ్చి చెయ్యాలని మా పెద్దల అభిప్రాయం. కానీ నా కిష్టం లేదు. అలాగని అర్జంటుగా ఎవర్నో ప్రేమించేద్దామని నే ననుకోవడం లేదు. అందుకు నేను రెడీగా లేను.

అయితే ఈ అబ్బా యెవరో, ఏమిటో తెల్సుకుందామని స్త్రీ సహజమైన ఆరాట స్వభావం వల్ల.. ఆ మరునటి రోజు సాయంత్రం నాలుగింటికి.. మాళవికని వెంట బెట్టుకుని లైబ్రరీకి వెళ్ళాను.

తెలుగు బుక్స్ ఉండే సెక్షన్‌లో ముగ్గు రబ్బాయిలు కూర్చుని చదువుకుంటున్నారు. వాళ్ళలో నాకు లెటర్స్ రాసిన అబ్బా యెవరో తెలియడం లేదు. వాళ్ళలో ఎవరూ తల కూడా ఎత్తి మా వేపు చూడ లేదు. అసలు ముగ్గుర్లో నాకు లెటర్స్ రాసిన అతడు ఉన్నాడో, లేదో తెలియదు. పావు గంట సేపు నేనూ, మాళవికా ఆ లైబ్రరీలో అటూ ఇటూ తిరిగి, అవసరం లేకున్నా ఆ పుస్తకాల్ని కెలికి.. చివరకు విసుగు పుట్టి, హాస్టల్‌కి తిరిగి వచ్చేశాం. ఆ తర్వాత రెండ్రోజులకి అతడి దగ్గరి నుండి నాకు మళ్ళీ ఉత్తరం వచ్చింది. ఏం రాశా డోనని ఆతృతగా ఆ కవర్ని చించి చదవ సాగాను.

"సింధు గారికి... మొన్న సాయంత్రం నాలు గ్గంటలకి మీరు లైబ్రరీకి రావడం నేను చూశాను. అప్పుడు నే నక్కడే ఉన్నాను. ఆ ముగ్గిరిలో నే నొకడిని. ఆ విషయం మీకు తెలియదు. మీరు ఒంటరిగా రాకుండా మీతో పాటు మరో అమ్మాయిని వెంట బెట్టు కొచ్చారు. మన మధ్య మూడో వ్యక్తి ఉండడం నా కిష్టం లేదు. అందుకే నేను మిమ్మల్ని పలకరించ లేదు. సోమవారం సాయంత్రం అదే టైంకి లైబ్రరీలో అదే ప్లేస్‌కి ఒంటరిగా రండి."

ఉత్తరాన్ని మడిచి నా వానిటీ బాగ్‌లో పడేశాను. ఆ అబ్బాయి నా కిలా ఉత్తరాలు రాస్తూ, నన్ను కలుసు కోవడానికి ప్రయత్నించడం నాకు బొత్తిగా ఇష్టం లేదని చెప్పలేను. అలాగని చాలా ఇష్టమని కూడా చెప్పలేను. నా మనసులో అర్థం కాని ఒకా నొక ఊగిసలాట.. ఓ సంఘర్షణ.. ఈ ఉత్తరాల ప్రహసనం.. నా మెదడు మొత్తం నిండి పోయింది.

ఎప్పుడూ అదే ధ్యాస. పరీక్షల కిక పది రోజులే పై ముంది.

సోమవారం సాయంత్రం సరిగ్గా నాలుగ్గంటలకి మళ్ళీ లైబ్రరీకి వెళ్ళాను. నా కళ్ళు ఆ అబ్బాయి కోసం తీవ్రంగా వెదక సాగాయి. ఆ లైబ్రరీలో తెలుగు బుక్స్ సెక్షన్‌లో ఒక్క షణ్ముగం తప్ప ఇంకెవరూ అగుపించడం లేదు. షణ్ముగం అక్కడ ఆ సెక్షన్‌లో జాబ్ చేస్తున్నాడు. అక్కడున్న పుస్తకాల రాక్స్ సందు సందులో వెదికాను. ఎవరూ కనిపించక పోవడంతో నిరాశగా మళ్ళీ హాస్టల్‌కి తిరుగు ముఖం పట్టాను.

ఆ రోజు సాయంత్రం మూడూ యాభై ప్రాంతంలో తమ ప్రొఫెసర్ గారు అర్జంటుగా రమ్మని కబురు పంపిస్తే తను ప్రొఫెసర్ గారి ఇంటికి వెళ్ళ వలసి వచ్చినదని, ఆ కారణంగా అవాళ నాలుగ్గంటలకి తను లైబ్రరీకి వచ్చే అవకాశం లేకపోయిందని సంజాయిషీ ఇస్తూ.. ఆ అబ్బాయి నాకు మళ్ళీ ఉత్తరం రాశాడు. గురువారం సాయంత్రం నన్ను నాలు గ్గంటలకి మళ్ళీ లైబ్రరీకి తప్పక రమ్మంటూ ఆ ఉత్తరంలో రాశాడు.

గురువారం ఉదయం.. నేను నా రూంలో బెడ్ మీద పరధ్యానంగా పడుకుని ఉండగా భాగీరధి మా రూంలో కొచ్చింది.

"ఏమిటే సింధూ! గది పైకప్పు కేసి పిచ్చి చూపులు చూస్తున్నావ్? అజ్ఞాత ప్రియుడికి సంబంధించిన ఆలోచనలతో తలమునకలై పోతున్నావా? పిచ్చిదానా! అక్కడికి రమ్మంటూ, ఇక్కడి రమ్మంటూ ఈ అజ్ఞాత ప్రియుడు నీకు లెటర్స్ రాసి నీ బుర్రని చెడగొడతాడే తప్ప.. అతడు మాత్రం నీకు ఈ జన్మలో అగుపించడనే సత్యం నా కిప్పుడే తెల్సింది" అంది భాగీరధి.


"ఏమిటే? దివ్య దృష్టితో చూసి ఈ సత్యం చెబుతున్నావా?" అంటూ భాగీరధి వేపు చూశాను.

అది నేరుగా వచ్చి నా పక్కనే బెడ్ మీద కూర్చుంది. మాళవిక స్నానానికి వెళ్ళింది.

"సింధూ! నువ్ చాలా సెన్సిటివ్ ఫెలోవి. ప్రతి చిన్న విషయానికీ విపరీతంగా చలించిపోయే తత్వం నీది. నీ హృదయంలో ఓ చిన్న కలకలం పుట్టించ గలిగితే చాలు. ఆ దెబ్బతో నీ ఏకాగ్రత పటా పంచలై పోతుంది. దాదాపు నువ్ స్థిమితాన్ని కోల్పోతావు. జీవితంలో నిన్ను ఓడించడం చాలా తేలిక. మర్రి ఊడని పీకి పారెయ్యాలంటే చాలా కష్టం గానీ.. మల్లె తీగని పీకి పారెయ్యడం కష్టమేమీ కాదుగా" అంది భాగీరధి.

"విషయం చెప్పవే!"

"ఇరవై రోజుల్నుంచి ఈ ఉత్తరాల ప్రహసనం వల్ల.. నువ్ ఏకాగ్రతతో చదవలేక పోతున్నావు. పుస్తకాన్ని పట్టుకోలేక పోతున్నావ్. వారం రోజుల్లో మన పరీక్షలు ప్రారంభం కాబోతున్నాయి. నువ్ ఇదే స్థితిలో ఉంటూ పరీక్షలు గానీ రాశావంటే.. మార్కులు తగ్గిపోయి ఫస్ట్ రాంక్‌ని కోల్పోతావు. యూనివర్సిటీ గోల్డ్ మెడల్ని చే జేతులా పోగొట్టుకుంటారు. గోల్డ్ మెడలిస్ట్ కావాలనే నీ ఆశయం గంగలో కలిసి పోతుంది."




"ఆఁ.." నేను భయపడ్డాను.

"గోల్డ్ మెడల్ కోసం నువ్ పుస్తకాలతో పోరాడుతున్నట్టే.. మన క్లాస్‌లో ఇంకా కొంత మంది పోరాడుతున్నారు. అందుచేత ఈ పోరాటంలో అంతర్లీనమైన వైరుధ్యం ఉండడం వల్ల.. ప్రతి మనిషీ ప్రతి మనిషికీ పరోక్షంగా శత్రువే. ఈ పోరాటంలో నిన్ను ఓడించి.. తను గెలుపొందడం కోసం నీ ప్రత్యర్థి పన్నుతున్న ఈ ఉత్తరాల వ్యూహంలో ప్రస్తుతం నువ్ ఇరుక్కున్నావ్."

"ఏమిటే ఇ దంతా ?"

"ఇది.. యుద్ధ నీతి. ప్రేమ అనే భావన ఉత్తరాల ద్వారా నీ హృదయంలో చెలరేగడం వల్ల.. నీ ఏకాగ్రత నాశనమై.. సైకలాజికల్‌గా నువ్ డిస్టర్బ్ అయి.. చదువుపై నుండి నీ మనసు డైవర్టయి పోతుంది. అప్పుడు నువ్ పరీక్షల్ని బాగా రాయలేవు. గోల్డ్ మెడల్ కోసం జరుగుతున్న పోరాటంలో నువ్ సులభంగా ఓడిపోతావు. యుద్ధ భూమిలో నైతిక విలువలకి సంబంధించిన తర్కానికి తావు ఉండదు. సింధూ! ఇది జీవిత సంగ్రామం. ఇక్కడ ప్రత్యర్థిని ఏదో విధంగా పడగొట్టడమే ముఖ్యం. ఇది నా సిద్ధాంతం కాదు. ఇవాళ మానవ జాతి పాటిస్తున్న యుద్ధ నీతి ఇది. అవినీతి వల్ల సంక్రమించిన గెలుపు.. నిజాయితీ వల్ల సంక్రమించిన ఓటమి కంటే గొప్పది కాకపోతే.. నీ ప్రత్యర్థి మాళవిక ఇలా ఈ కుట్ర ఎందుకు పన్నినట్టు? దాని నోట్ బుక్‌లో దొరికిన లెట రిదిగో" ఇచ్చింది భాగీరధి.

"డియర్ గోపీ! మన ప్లాన్ గొప్పగా పోతోంది. నేను చెప్పినట్లు నువ్ రాస్తున్న లెటర్స్ వల్ల.. సైకలాజికల్‌గా డిస్టర్బయిపోయి చదవడం మానేసింది సింధు. కనుక గెలుపు నాదే. గోల్డ్ మెడల్ నాకు రావడం గారంటీ.." మాళవిక రాసి గోపికి పోస్ట్ చెయ్యడం మరిచిన అతికించని ఆ లెటర్ని చదివి నేను కొయ్యబారి పోయాను.

## పుస్తకం.

ఉవ్వెత్తున ఉప్పొంగే
ఆలోచనల కెరటాలను
అంతలోనే ఆపి అక్షరాలు తొడిగితే
ఒక సుదూర సముద్రపు హెూరు
కాగితాలపై మన ముందు కొస్తుంది

*

పుస్తకం రెండు అట్టల మధ్య దాగి
ఎవరో చాస్తున్న స్నేహ హస్తం
నల్ల సిరా, వెదురు గుజ్జూ కాదు.
ఒక సమాజపు సంతోష ప్రకంపనలో
లేక బీభత్స దృశ్యాల దుమారమో
మోసుకొచ్చే జీవధార

*

చట్టబద్ధమైన హెచ్చరికలతో
మాదకతా వాగ్దానాలతో
రోమాంచిత వాంఛితాలతో
ఉన్న పళాన ఎవడో ఊసిన
జుగుప్సాకర పదార్థం కాకూడదు

*

మెదడు కంట నీరు కారితే
గుండె మంట మరిగిస్తే
ఆవిరై ఆలోచన గడ్డ కట్టి
మన తలలపై గుమిగూడే వాన మబ్బు

*

వాతావరణ సూచన అనవసరం
వానలో తడవడానికి.
పదండి ఆరుబయట నిలబడదాం!

\- రామతీర్థ